# ఖండ గుత్త

అప్పటికింకా పొద్దుపోలేదు. 'బట్టాలస' కి పడమటి దిక్కునున్న కొండ ఎగువన పొద్దు మునిగే వేళ అది! కొండ నీడలు యీ వెలుగుకు కొండ వాలుల్లోన పడి అక్కడ చీకటి చీకటిగా వుంది!

ఆ కొండ వాలున పశువులు మేత మేస్తున్నాయి. పశువుల కాపరులు దూరాన తుమ్మిక చెట్లెక్కి పళ్ల తెంపుకుంటున్నారు.

ఆ సమయాన, ఎక్కడి నుండో వచ్చిన పులి....కొండవాలు అంచున పచ్చగడ్డి మేస్తోన్న ఎద్దు మీదకి దూకింది. ఆ ఎద్దు ఉయ్యాక భీముడిది. పులి మీద పడటంతో, భయంతో గట్టిగా అరిచి పడిపోయింది ఎద్దు. మిగిలిన పశువులు హడలెత్తిపోయి....అరుస్తూ తలా ఓ దిక్కు పరుగెత్తాయి. ఈ అరుపులకి తుమ్మిక చెట్లమీదున్న పశుల కాపరులు క్రిందకి చూసారు. ఇంకేముంది....! ఎద్దుని కింద పడదోసి పులి రక్కేస్తోంది. ఎద్దు భయంకరంగా అరుస్తోంది!

పశువుల కాపరులు చెట్ల మీంచే అరవసాగారు. పులిని అదురుతూ కేకలేసారు. తుమ్మిక చెట్ల నుంచి గట్టి కాయలు తెంపి పులిమీదకు గురిజేసి విసరసాగారు. వీరి కేకలు విన్న పోడువ్యవసాయం అరపల మీదున్న వారు డబ్బాలు మోగించి కేకలు ప్రారంభించారు. మొత్తానికి కొండంతా

శబ్దాలతో గగ్గోలు పుట్టగా....అప్పుడు పులి గాభరాపడి ఎద్దునొదిలేసి పారిపోయింది. కానీ, ఎద్దు అప్పటికే శిథిలమయిపోయింది !

ఈ వార్తను విన్న భీముడూ, భీముడి భార్యా: వలస జనమూ కొండ చేరారు. భీముడి భార్య —

"....దార్వాత నా బతుకు తీస్సిందిరో. నా కాలిరి సేసిందిరో నాయినా. ఎద్దులేని ఎవసాయమెలాగరో దేముడా ? ఏపేట పంటలు ఆ సావుకారి పులి తినేత్తంది. యీ అడివిల మా బతుకిలాగ బుగ్గయి పోవడమేనా తల్లే....జాకర్దేవతా ?

యికిప్పుడు యవసాయానికి ఎద్దునే కొంతామా ? ఆ సావుకారి బాకీయే తీరుత్తామా ? యేటి దారిరో భగవంతుడా ?" అని కడుపు తరుక్కుపోయేలా యేడుస్తోంది.

"అన్నిటికీ ఆ భగవంతుడే వున్నాడు. నారుబోసినోడు నీరుబొయ్యడా ? లెగండి, లెగండి. సావుకార్ని యీ యేటి బాకీకి వాయిదా అడగండి. పంటలమ్మిసి యెద్దు కొనండి," అని సలహాయిస్తూ, ఉయ్యికి భీముడ్నీ, భీముడి భార్యనీ ఓదార్చారు అక్కడికొచ్చిన వలసోల్లు.

* * *

మరసట్నాడు భీముడు రెండు పనసపళ్ళను కావిడేసుకొని పయనమయ్యాడు పల్లంలోనున్న తిరపతయ్య సావుకారి యింటికి !

తిరపతయ్య సావుకారి కొండమామిడి గున్న ఎత్తుంటాడు. ఏతుపంది ముల్లులాంటి తల వెంట్రుకల్తోటి, చూలున్న అడివిపంది కడుపులాంటి బొజ్జతోటి, బలిసిన దున్నపోతులాగుంటాడు.

అప్పులిచ్చినపుడెన్ని షరతులు పెడతాడో, వసూలుజేసినపుడూ అంత కరాకండీగుంటాడు. అసలూ ఫాయిదాలూ రాకపోతే శవాన్నిగూడా వొదల్డు. అందేతనే కొండ వ్యాపారం ఆరంభించకముందు పల్లంలో కల్లం తప్ప ఇతర ఆస్తి యేమీ లేనోడు.... యీనాడు భూఖామందులూ,

నగలా నాణ్యాలా, డాబాలా, ఇనప్పెరువాలా గాక; పెద్ద పెద్ద వారితో స్నేహాలా, చుట్టరికాలా కలిగి గౌరవింపబడుతున్నాడు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి నుండి అప్పుకోసం ఇండియా యెన్ని షరతులంకంగీకరించవలసి వచ్చిందో; అంతకెక్కువ షరతులకు భీముడు ఒప్పుకోవలసి వచ్చింది.

ఉయ్యక భీముడు అప్పు అడిగినపుడే తిరపతయ్య చెప్పాడు.—

"ఉయ్యకోడా! కండగుత్త మీద యిస్తేనే మీ కోదోలు అప్పు తీర్పగల్రు. సొమ్ముకి సొమ్మెక్కడ తేగల్రు? యిదిగో నువ్వు పట్టుకెల్తున్న వందరూపాయలకి చింతపండుసేజన్ల కింట్లామున్నర పండు యిచ్చుకోవాలి. అలాగైతే, నీకూ, నాకూ బాకీ చెల్లిపోద్ది. ఒకేల నువ్వప్పుడు పండు తక్కువజేత్తే.... ఎంత తక్కువయితే అంతటికీ అప్పుడు పండు రేటు లెక్కగట్టి; ఆ డబ్బుకి ఈ కండన మీదే నోటు రాసుకుంటాను. యేటి? అదీ షరతు. నీ కిస్టమయితేనే పట్టికెల్లుసుమ్మీ. ఇస్టంలేపోతేమానెయ్యి.... ఫర్లేదు!" అని బలవంతం కాదు సుమా అన్నట్లుగా మాట్లాడి; అవసరాన్ని ఆసరాగా తీసుకొని భీముడ్ని బాకీ వలలోకి లాగాడు.

బాకీ పడినందుకు భీముడు....దమ్ముల్లో తిరపతయ్య మళ్ళ దమ్ము పట్టవలసి వచ్చింది. నూర్పుల్లోన రాత్రీ, పగలూ పనిజెయ్యవలసి వచ్చింది.... పెట్టికి! పోడుమీద పండినకందులు కావిడేసి సావుకారికివ్వాల! అరటిగెల అపుర్వాల! పనసపళ్ళు పట్టుకెల్లాల! సావుకారి వొలసొచ్చినపుడు బియ్యం, పప్పు ఉప్పూ, మిరపకాయ భత్యమివ్వాల! వెళ్ళిపోయినపుడు కోడిపెట్ట పెంటపంపాల! ఎలక్షన్లో తిరపతయ్య చెప్పిన గుర్తుమీదే ముద్రెయ్యాల! ఈ విధంగా కొట్టుకుచస్తున్నాడు ఉయ్యక భీముడు.... సావుకారి వలలోంచి బయటపడలేక!

తిన్నగా పనసపళ్ళ కావిడ్ని తిరపతయ్య ఇంటి గడపలో దించేసి, మొలపంచెతో మొహం తుడుచుకుంటున్నాడు భీముడు.

"యేట్రోరే ఉయ్యికోడా ? ఉట్టి పనసపళ్ళే కావిదేసుకొచ్చినావు. చింతపండేదిరా ?" అని అడిగాడు తిరపతయ్య.

వచ్చీ రాగానే, సావుకారి చింతపండు బాకీ అడిగేసరికి, వెంటనే సమాధానం చెప్పలేక భీముడు మౌనం వహించాడు.

"అదేట్రా ? యిదిగో తీర్సేత్తా నని సెప్పి, అయిదేళ్ళకాంచి యేటేటా కొనసాగదీతన్నావు. ఏమిరా అంటే—పెళ్ళానికి బాగలేదు. పోడు పండలేదు, చింతలు కాయలేదు.—యిలగేదో ఒకసాకు సెప్తావు. యిలాంటి మాదర్సోళ్ళవంతే అప్పివ్వకపోదును సుమ్మీ. యేదేమైనా, యీ యేడు బాకీ పూరాగా తీర్సేవాల్సిందే. ఆఁ." అన్నాడు సావుకారి.

"అదికాదు బాబ్. నిన్న కొండోరన మేత్తన్న నా ఎద్దుని పులి గొట్టేసింది. ఎద్దు జతకి ఎద్దెయ్యకపోతే యవసాయం సాగదు. అందికనీ, నీ బాకీ....వొచ్చేపంటకి...."

"నీ బాధలు నువ్వు సెప్తే, నా బాధలెవుడింతాడురా ? అదేటీల్లేదు.. ఎదవా ! ఎదవలకి ఎయ్యి రకాల బాధలు ! మల్లి, అది సాలక యీలకి సంగాలొకటీ !

యేమిరా ? కోతలపుడు గొప్పయిపోనావు. సంగమోలితోట కలిసి సెంకలు గుద్దినావు. అంతేగానీ, ఆపదల్నాడు సావుకారి అక్కరొచ్చి ఆమ కున్నాడని సూసినావా ? నీదే ? నువ్వా కోతకూలి పెంచమన్నావు. ఎట్టీ సెయ్యనన్నావు. పంటలు మావన్నావు. నీకులేని ముగమాటం నాకెందుకు ? ఒరే, నిన్నేగాదురా ! మీ కొండ నా కొడుకులెవులినీ వొదల్ను - నా బాకీ లేనా తీర్సాల. భూమీ, పుట్టా అయినా అప్పుకింద చెల్లు జెప్పాల ! ఆఁ ! అంతే. ఎల్లు, ఎల్లి, రేపు రడీగుండు. బండి తోలుకొస్తాను. ఇంటిల యేదుంటే అదే కొలుద్దువు గాని ఎల్లు. ఎల్లారే—" అని మారు జవాబుకి తావివ్వకుండా భీముణ్ని తగిలేసి, ఇంట్లోకి వెళ్ళిపోయాడు సావుకారి.

సంగాల సేరినందుకు సావుకారి యిలాగ పగబడతాడనుకోలేదు.

ఎకరాలకెకరాలు ఎట్టికి సెయ్యము—అనడం తప్పా ? తాతల్నాటి కూలికి పని సెయ్యలేమని, కూలి పెంచమన్టం తప్పా ?

బుగ్గయి పోతన్న మా బ్రతుకుల్ని బాగుసెయ్యడంకి సంగపోలు సూసుకున్నారు. సంగపోలు నేపోతే కూలిగింజలేనా కొస్తుమా ? తిండి గింజలకి వొసిపోమా ? నేదు. సంగపోలు నేకపోతే మాకు బతుకునేదు ! అదిగా, సంగపోలుకే సెప్పాలీసంగతి !— యిలాగ మనసులో కూడ బలుక్కొని సీముడు యిల్లు జేరాడు.

○ ○ ○

మధ్యాన్నం....

పొద్దుట పదిగంటల వేళ !

బజ్జాలో ఉన్న మొగనున్న రావిచెట్టు మీద ఎర్రజెండా ధగ, ధగా మెరుస్తోంది ! కొండల మించి సూర్యుని వేడి వలసంతా నిండుతోంది !

ఉయ్యాక సీముడింటిముందు తిరపతయ్య ఎడ్లబండి ఆగింది. బండి లోంచి తిరపతయ్య దిగాడు. ఆ తర్వాత, వెంటతెచ్చిన కూలీలు యిద్దరూ దిగారు.

"ఒరె, ఉయ్యాకోడా....రారివతలకి" అని ఇంటిలోకి చూస్తూ కేకే సాడు తిరపతయ్య.

ఆ కేకకి ఉయ్యాకోడు రాలేదు. అతని పెళ్లం బయటకొచ్చింది.

"....ఉయ్యాకోడేడి ?" సావుకారి.

"సల్లంది తాగుతన్డు...."

"నిలబడిన పాటుగ నా బాకీ తీర్సమను...."

"మేటకేటా నువు నిలబడ్న పాటుగే కొలిసీసోలిమిగాదా ?

యీ మేడుకి గోరం జరిగిపోనాది. కసింత తాలమంతన్నావు...."

"తాలశంలేదూ, తూలడం లేదూ....ముందు బాకీ గక్కమనే...."

"నీకోసం కావాలంటే కల్లా కక్కుకుంతే...ఆది సొమ్మా? సోడి పిండంబిలా?"

"అడిగినపుడు తీర్సలేనోడు ఎవుడమ్మ మొగుడిదని ఓడీసు కున్నాడే? ఎవుడి పెళ్లాం రంకు మొగుడి సొమ్మే ఎగమెడ్డీడానికి?" అని బూతుల్లోకి దిగాడు సావుకారి.

"తిన్నగ మాటలాడనీ....మల్ల! బాకీ వున్నామని అమ్మలకి, పెళ్ళా లకి రంకు గడతావా? జేగర్త.... మల్ల...." అని కసురుకున్నాడు భీముడు ఇంట్లోంచి కోపంగా బయటికొస్తూ!

సావుకారి కొద్దిగా జంకాడు. మల్లీ వెంటనే బింకం తెచ్చుకొని తిరిగి కేకలేసాడు.

"ఓరె, ఓరేట్రా? అంత రోసమున్నవోడివి నా బాకీ తీర్సిరా! నీ అమ్మమీద అంత అభిమానమునోడివి నా సొమ్ము కక్కరా. పెళ్లాం మీద ప్రేమునోడివి....నా అప్పు తీర్సిరా! తీర్సిరా. ఆఁ!

యేటి? కేకలకి ఒడికిపోతాననుకుంతన్నావేటి? నీకిలాకాదు. ఓరేయ్, బండి మనుసులా, రాండ్రా! రండి, ఈడింట్లో దూరి, యే గింజబుంతే అవి కొలండి! ఈడూ, ఈడి బాబూ, ఎవుడొచ్చి, యేటిజేత్తాడో సూద్దుం! రండ్రా!" తనతో తెచ్చిన కూలోల్ని తీసుకొని, భీముడింట్లో చొరబడ్డాడు సావుకారి!

ఈ తగువుకీ, కేకలకీ యిరుగూ, పొరుగూ అంతా చేరారు. తలా ఓ సలహా యిస్తున్నారు భీముడికి. భీముడి భార్య మాత్రం ధైర్యంగా—

"యేటలగ సూత్తావు? ఎల్లు, ఎల్లి సంగం బావుల్ని పిలిసికిరా! ఆలే యీ గండడికి తగినోలు! నీసి గండడిని యింటిలబెట్టి, బయటి గొల్లెమెట్టీసి గూకుంతాను. నువ్వెల్లి రా...." అని భీముడ్ని సంగమోళ్ళ కోసం పంపింది.

భీముడితోపాటూ, కొంతమంది జనమూ సంగం ఆఫీసుకి కదిలారు ! వలస మధ్య నున్న ఓ పూరిపాకమీద ఎర్రజెండా మెరుస్తోంది! ఆ పాకలో, నేలమీద కూర్చుని, సంఘం బాధ్యుడైన కామ్రేడ్.... గ్రామ కమిటీతో యేదో ముచ్చటిస్తున్నాడు. అదిగో అప్పుడు భీముడు వెళ్లి.... సంగతి చెప్పాడు. ఆ కామ్రేడ్, వెంటనే సావుకార్ని అరెస్టుజేసి, తీసుకు రమ్మని గ్రామకమిటీని పంపాడు.

గ్రామకమిటీ, వారి వెనుక భీముడూ, వలసలోని ప్రజలూ భీము డింటికి బయల్దేరారు. భీముడింటి తలుపుగొళ్లెం తీసి; అటకమీద సామాన్లు దింపుతున్న సావుకార్ని పీకపట్టుకొని దింపి, గ్రామకమిటీ అరెస్టు జేసింది ! సావుకార్ని మధ్యలోనుంచి, గ్రామకమిటీ, జనమూ సంగం ఆఫీసుకి సాగారు. ఈ గొడవలో చల్లగా జారుకున్నారు సావుకారి బండి కూలీ లిద్దరూ.

సంగం ఆఫీసు దగ్గర జనం నిండిపోయారు. అంతా కామ్రేడ్ యేమిజేస్తాడో- అని చూస్తున్నారు.

కామ్రేడ్ గొంతువిప్పి-

"సావుకారి తిరపతయ్యా...ఉయ్యిక భీముడికి ఎంత అప్పిచ్చావు ?" ప్రశ్నించాడు.

"వొంద రూపాయలు..." అన్నాడు సావుకారి.

"యెన్నేళ్ల కిందట..."

"అయిదేళ్ల కిందట..."

"యిపుడెంత బాకీ యింకా మిగిలుంది ?"

"పదమూడొందల, యాభై బాకీవున్నాడు..." అని, తన బిట్టా పుస్తకం తీసి, చూసి చెప్పాడు సావుకారి !

"అయిదేళ్ల కిందటి వంద రూపాయల బాకీ, యిప్పుడు పద మూడొందలేభైకి పెరిగిందా ? యిది యే వడ్డీ రేటులో పెరిగింది ? యే

గవర్నమెంటు చట్టం ప్రకారం నువ్వా రేటు వేసావో చెప్పు ?" అని కోపంగా ప్రశ్నించాడు కామ్రేడ్.

సావుకారి యేదో అనబోయాడు. ఇంతలో, భీముడి భార్య లేచి వచ్చి-

"మరీ, మద్దికాన మీము కొలిసిన సింతపండేటయినాది ? కందులూ, పనస పల్లేటయినావి ? కోడిపెట్టల బత్తెమేటయినాది ?" అని ప్రశ్నించింది తీవ్రంగా !

కామ్రేడ్ ఆమెను సర్దిచెప్పి కూర్చోబెట్టి, సావుకార్ని జవాబు చెప్పమన్నాడు.

"నీ నిచ్చింది వొడ్డీకిగాదు. కండనకిందిచ్చాను. వొందరూపాయిలికీ కింట్లా (క్వింటాల్) మున్నర చింతపండి వ్వాలన్నాను. ఆడు, అందు కొప్పుకునే వోడుకున్నాడు. యిదిగో, యీ చిట్టా చూడండి..." అని, చిట్టా చూపించాడు సావుకారి !

చిట్టాలో యీ క్రింది విధంగా అప్పు పెరిగింది.

| కాలం | బాకీ చింతపండు | చెల్లింపు | బాకీ | ధర | అప్పటి కేజీ ధర |
|---|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 150 కేజీలు | 50 కేజీలు | 100 Kg. | 150రూ॥లు | 1-50 |
| 2 -డిటో- | 225 ,, | 100 ,, | 125 ,, | 218-75 | 1-75 |
| 3 -డిటో- | 320 ,, | 130 ,, | 200 ,, | 400-00 | 2-00 |
| 4 -డిటో- | 600 ,, | 200 ,, | 400 ,, | 900-00 | 2-25 |
| 5 -డిటో- | 1350 ,, | 675 ,, | 675 ,, | 1350-00 | 2-00 |

"యిదిగో బాకీని కాదనీ మనండి. నా బాకీ వొసూలు జేసుకోడం తప్పా చెప్పండి ?" అని అడిగాడు సావుకారి.

"బాకీ ! హుం... ఎవరు ఎవరికి బాకీయో నీ లెక్కలే చెప్పటం లేదా ? ఈ కొండల్లోన, ఈ అడివిలోన, ఈ వాలసలలోన మీరు వ్యాపారం పేరిట వచ్చి దోపిడీ సాగించారు. అమాయకులైన యీ ప్రజలమీద క్రూర జంతువుల్లాపడి నంచుకు తిన్నారు. నీ దగ్గర అప్పు తీసుకున్నందుకు... ఆతడు తన సర్వమూ నీకు ధారబోసాడు. తను మాత్రం టెంక పిండం బలీ, గెడ్డనీరూ తాగి; గోచి గుడ్డతోటి మిగిలాడు. అయినా, యింకా అప్పు తీరలేదని అంటున్నావు. నిజానికి నువ్వే యీ అమాయక ప్రజలకు బాకీ వున్నావు. నువ్వు కట్టిన ఆ గుడ్డలు ఈ ప్రజలవి. నువ్వు పోగేసుకున్న అస్తిపాస్తులు ఈ ప్రజలవి. నీ శరీరంలోని రక్త, మాంసాలు యీ ప్రజలవి !

యింత బాకీ తీర్చాల్సిన నువ్వు, యింకా పెద్దమనిషిగా, వ్యాపారిగా దోపిడీ ప్రభుత్వహయాంలో చలామణీ అయిపోతున్నావు. కానీ, యీనా డిక్కడ మీ దోపిడీ ప్రభుత్వం లేదు. మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం... సంగ ముంది !

ఈ సంగం నిన్ను దోషిగా నిర్ణయించింది. ప్రజాభీష్టం మేరకు నీకు శిక్షపడుతుంది..." అని ఆగాడు కామ్రేడ్.

అక్కడి ప్రజలు ఒక్కొక్కరూ వచ్చి సావుకారిపై శిక్షలు ప్రకటించడం ప్రారంభించారు.

"సావుకారి ఆస్తి పాస్తుల్ని సంగం జప్తు జెయ్యాల !"

"మా భూ పుల్ని మా కొదిలియాల..."

"ఆ చిట్టా పుస్తకం చింపీయాల..."

"యిక ముందుకొంచి, యీడు వాలసల అడుగుపెట్టగూడదు..." యిలా తలా ఓ ప్రకటన ! అప్పుడు భీముడు

"దోతర్పిగా, నా ఇంట్లో దూరినందుకూ, నాతల్లీ, పెళ్లాలని

తిట్టినందుకూ, యీడికి యీ పొద్దు సాయింత్రం దాక, యీ రాయిచెట్టుకి కట్టీయాల !" అన్నాడు.

సావుకారికి చెమట్లు పట్టేసి, గొంతు తడారిపోతోంది ! జనం అంతా భీముడి డిమాండుని, అంగీకరించి-"ఔను, కట్టీయాల"- అని కేకలేసారు.

గ్రామ కమిటీ వారు, సావుకార్ని తీసుకెల్లి, ఊరిముందరి రావి చెట్టుకి కట్టివేసారు తాళ్లతో !

జనం ఉప్పొంగి పోయారు !

"గిరిజన సంగం- వొర్ధిల్లాలి !" "సావుకారి దోపిడీ...నశించాలి!" లాంటి నినాదాలు మిన్ను ముట్టాయి.

చెట్టుకి కట్టబడిన సావుకారి వద్దకు శివాలెత్తి వస్తూ భీముడి భార్య-

"మా రక్త మాంసాల్ని అప్పుకింద కోసీసుకొని, మా సంపదల్ని వోసీసుకొని మా కడుపులు కాలిస్సినావు గదరా... గండా ! నేస్తం, నేస్తం అని మా నోటిల మన్నుబోస్సినావు గదా ! నీ జిమ్మబడా థూఫత్..." అని కాండ్రించి సావుకారి మొహమ్మీద ఉమ్మింది.

ఇకంతే, వరుసగా, ఇంటికొకరుగా వలస జనమంతా, తిట్లూ శాపనార్ధాలు బెడుతూ, సావుకారి మొహమ్మీద కాండ్రించి ఉమ్మసాగారు !

శ్లేష్మంలో పడ్డ ఈగ...ఆ సాయంత్రానికి గ్రామ కమిటీచే విడుదల అయింది !

★